# వంక

గోపీకి ఆలోచన లెక్కువ. చిన్నప్పుడే మలేరియావచ్చింది. పైత్య శరీరం. "పైత్యం ఎక్కువయితే మలేరియా వచ్చిందా? మలేరియా ఎక్కువయి పైత్యం వచ్చిందా?" అని ఇంకా ఆలోచిస్తూనే వున్నాడు.

"చెట్టు ముందా విత్తుముందా ?" అనేది పెద్ద ప్రశ్న. పెద్ద ప్రశ్నలేవీ తేలవుగా! కాని, గోపీకి ఆలోచనజాస్తి. అందరిలాగా తేలేవాటిని గురించి ఆలోచిస్తాడా ? తేలని వాటిని గురించే ఆలోచిస్తాడు. జీవితమంతా ఆలోచిస్తూనే వున్నాడు.

ఈలోగా మధ్యమధ్య చిన్నచిన్న ఆలోచనలు. చెబుతాను. సినిమాకు పెద్ద కథ రాస్తూ వుంటాం అనుకోండి. ఈలోగా చిన్న చిన్న ఆలోచనలు తడితే చిన్నకథలు రాసి పూర్తి చెయ్యం! పెద్ద కథ అలా జరుగుతూనే వుంటుంది. చిన్నకథలు పూర్తవుతాయి. ప్రచురిస్తాం. కాని అసలు పెద్ద కథ సంగతి మరచిపోం. ఆలోచిస్తూ వుంటాం—ఆలోచించటమే ఆలోచించటం.

"ఆలోచనలు ఎక్కువయ్ చెడిపోతున్నావ్ !" అన్నాడు తండ్రి.

"చెడిపోవట మంటే ఏమిటి ?"అడిగాడు గోపి.

"ఇదే, ఇదే" అన్నాడు తండ్రి.

అన్నీ ఇలాగే—

"చెట్టు భూమిలోకి ఎందుకు పెరగదు ? పైకి ఎందుకు పెరుగుతుంది ? లోపలికి పెరిగితే ఏమవుతుంది ?" అని తనలో తానే నవ్వుకుంటాడు.

"కారుకూడా ప్రాణం వుందేమో? లేకపోతే ఎట్లా నడుస్తుంది?" అని ప్రశ్న.

"ఉంటే మనకు తెలియదా?" అని జవాబు.

"పశువులకు ప్రాణం వుంది. అవి చేసేమోతలు మనకు అర్థం అవుతయ్యా? కారూ మోతచేస్తూ వుంటుంది." అని సమాధానం.

"వానపాము ఏమోతా చెయ్యదు. అలా నడచుకుంటూ పోతుంది. అందులో ప్రాణం వుందని ఎలా? కారూ అంతే! నడుచుకుంటూ పోతుంది. మోతకూడా చేస్తుంది. కారుకీ ప్రాణం వుంది."

కానీ, అంతటితో వూరుకోకుండా—

"వానపాముని చంపితే బ్రతికించలేం. కారుని చంపావచ్చు, బ్రతికించా వచ్చు. ఇదెట్లా?" అని ప్రశ్న.

"అదో విచిత్ర ప్రకృతి. రకరకాల జీవులు. రకరకాల పకృతులు—అన్నీ ఒకరకం అయితే ప్రపంచం ఎలా అవుతుంది? స్వర్గం అవుతుందిగా! స్వర్గంలో చూచారా, చావా చావరు, బ్రతకా బ్రతకరు. వాళ్ళకు బుద్ధిలేదు, బుద్ధున్న వాళ్ళు రెండూ చేస్తారు.

ప్రతిదీ ఇంతే—!

కొన్ని రోజుల్నుంచీ, మరో ఆలోచన పట్టుకుంది. ఎక్కడ చూచినా ప్రజాసామాన్యం అన్నమాటే వినబడుతూ వుంది.

"ఎందుకిల్లా రాశావ్?" అని అడిగాడు.

"ప్రజాసామాన్యానికి అర్థంకావటానికి" అన్నాడు రచయిత.

"ఈచిత్రం బాగాలేదు. ఇంతకంటే ఇంకా బాగా తియ్య కూడదూ?" అని అడిగాడు.

"తియ్యటానికేం! అలాతీస్తే ప్రజాసామాన్యానికి అర్థంకాదు" అన్నాడా డైరెక్టరు.

అన్నీ అంతే. అందరి పెదిమలమీాదా ప్రజాసామాన్యమే!!!

"ప్రజాసామాన్యం క్షేమంకోసం మీారు సత్యాగ్రహం చెయ్యాలి" అంటాడొకడు. మరొకడు "ప్రజాసామాన్యం క్షేమంకోసం ఇప్పుడు మీారు సత్యాగ్రహం చెయ్యొద్దు" అంటాడు. "ప్రజాసామాన్యం క్షేమంకోసం వితంతువులకు వివాహం చెయ్యాలి" అంటాడొకడు. మరొకడు "ప్రజాసామాన్యం కోసం వితంతువులను అలావుంచాలి" అంటాడు. కారణాలకేం, కారణాలు ఎన్నైనా చెబుతారు. వినేవాళ్ళుండాలి గాని కారణాలు దొరక్కపోతయ్యా?

"మీాకేం? మీారెన్నన్నా చెబుతారు. ప్రజాసామాన్యం అందుకింకా తయారు కాలేదు" అన్నాడొక సంఘ సంస్కర్త.

గోపీ ఆలోచించాడు. చెప్పాగా అతనికి ఆలోచనలు ఎక్కువనీ, ఆలోచనలు ఎక్కువై చెడిపోతున్నాడని తండ్రి అన్నాడనీ!

ఎవరేమన్నా ఆలోచించటం ఎట్లామానివేస్తాడు? మానేస్తే గోపీ ఎల్లా అవుతాడు? పీపీ అయ్యేవాడు. అందుకనే ఆలోచించేవాడు.

ఎవ్వరీ ప్రజాసామాన్యం? ఎవరికివాళ్ళు ప్రజాసామాన్యంలో చేరినట్లు మాట్లాడుతారే! మళ్ళా అంతా ప్రజాసామాన్యం క్షేమంకోసం ప్రయత్నిస్తారెందుకు?

అదేం అప్సరసా—?

అప్సరసంటే ఇనప కచ్చడాలవారికి ఇష్టం. మరొకళ్ళయితే వీరి చాతుర్యం చూపటానికి ఏమి వీలుంది? ఇనప కచ్చడాల వారికే అప్సరసంటే ఇష్టం. విశ్వామిత్రుడూ వాళ్లూ లేరూ? వీళ్ళు కళ్ళుమూసుకుంటారు. వాళ్ళు అభినయంపడతారు. ఇంకేం? రస సృష్టి అవుతుంది. ప్రవరుడైతే పారిపోతాడుగా!

'శ్రీహరీ!'

మరి ఇక్కడ అలాకాదే? ప్రజాసామాన్యం అంటే అందరికీ ఇష్టమేనే !!

ఇదేం డబ్బున్న వితంతువా?

అలాగయితే అంతా మూగుతారు. పాపం వితంతువుకి ఎవ్వరున్నారు? ఉన్న పొలం దున్నించుకోవాలన్నా ఎవరిమీదో ఆధారపడాలి. తండ్రికూడా లేకపోతే మరీవాటం. భర్తతరఫు నుంచి ఏదో వస్తుందిగా! అదుంటుంది. అనేవాళ్ళెవరుంటారు? చూడగా మన సంఘంలో వితంతువులపనే వాటంగా వున్నట్లుంది. వాళ్ళు జీవించటానికి మగవాళ్ళఅండ కావలసివస్తుంది. అన్నదగ్గిరా, తమ్ముడుదగ్గిరా వుండబుద్ధవదు—వుంటే వదినా మరదలూ బతకనిస్తారా ఏమిటి! అందుకని ఒక్కత్తే వేరేగా వుంటుంది.

చూడండి. ఒకవితంతువు—భర్తతరఫు ఆస్తి వుంటుంది వితంతువు సబ్బు వాడకూడదుగా! అందుకనికొబ్బరి నూనెతో స్నానం చేస్తుంది. వొళ్ళు నున్నగా గట్టిగావుంటుంది. కొబ్బరి నూనె వాడటంవల్ల శరీరానికి వేడెక్కుతుంది.

ఇక చలంగారి నరాలబాధ. ఆ బాధ దాక్కోదుగా!

కళ్ళల్లో కనిపిస్తుంది. కళ్ళూరుకుంటాయా? అందర్నీ ఆహ్వానిస్తాయి.

అంతా ఎందుకు మూగరూ! చూస్తూవూరుకుంటానికి మనది పుణ్యభూమాయె!! కనక ప్రజాసామాన్యం వితంతువై వుండాలి.

కాకపోతే, మైనరేమో!

అప్పుడు చూడండి. అందరికీ రక్షించి లాలించ బుద్ధవుతుంది. మేజరయ్యేదాకా డబ్బుతో జేబుల్ని నింపుకోవచ్చు. జేబుల్నిండిం తర్వాత అంతా పెద్ద మనుషులే!

పెద్దమనుషుల సంఘంలో ఒకర్నొకరు "నీ జేబులెలానిండినయ్?" అని అడుగుతారా ఏమిటి?— పాడు

ఆ రాత్రి అతనికి కలొచ్చింది. అబ్బో! గోపీకి కలరావటమంటే సామాన్యమా? మేల్కొనే కలలు కంటాడు. అసలు కలలు ఇంకెంత చిత్రంగా వుంటాయి!!! మీకు బాగా తెలిసుంటుంది. వానాకాలంలో ముసురుగా వున్నప్పుడు వుసిళ్ళు లేస్తాయి చూడండి—అలా లేచినయ్ వూహాలు!

ఎక్కడికో ఏకాగ్గా నడిచిపోతున్నాడు. ఎక్కడికో! ఎందుకో!! వూరికే నడిచిపోతున్నాడు. కాళ్ళు భూమిమీద ఆనటంలేదు. ఏసుక్రీస్తుకి సముద్రంమీద ఆనాయూ ఏమిటి? అలా ఏకాగ్గా పోతున్నాడు. ప్రపంచంలోనూ అంతే—

ఒకవూరు ప్రవేశించాడు. అది వూరనుకోటానికి కారణం ఏమీలేదు. గోపీకి అనిపించింది, అనుకున్నాడు అతనితో ఏవైనా అంతే! అనిపిస్తుంది అంటాడు. చెప్పాగా అతనికి ఆలోచన లెక్కువనీ మరి చిన్నప్పుడే మలేరియా వచ్చిందనీ—

సరే, ఆవూరు సంగతి చెప్తా-ఆవూళ్ళో ఇళ్ళులేవు.

"ఇళ్ళు లేకపోతే వూరెలాఅవుతుంది?" అని అడుగుతారు.

"ఇళ్ళుంటేవూరెలా అవుతుంది? అలాగే అయిం"దంటాను.

అలాగే అవుతుంది. అలాగే అయింది.

ఆవూళ్ళో ఇళ్ళకు గోడల్లేవు.

"గోడల్లేకపోతే ఇళ్ళెలా అవుతాయి?" అని అడుగుతారు. చాదస్థంఅంటాను. "గోడలుంటే, గోడలే అవుతాయి, గోడల్లేకపోబట్టే ఇల్లవుతుంది", అంటాను.

ఆ ఇంటి కప్పులు ఆకాశంమీద తేలిపోతున్నయ్.

"ఇళ్ళు లేదపోతే కప్పులెలావుంటాయ్?" అంటారు.

"ఇళ్ళులేకపోబట్టే కప్పులు అయినయ్" అంటాను.

గాలికి ఆకప్పులు అలాఇలా వూగుతున్నాయి, జపాన్ కాదు. అక్కడ వూగివూగి కిందపడతాయి. మేఘాలూకాదు.

గోపీ చూచాడు. చెప్పగా అతడికి ఆలోచన లెక్కువనీ, ఆలోచనలతో చెడిపోతున్నాడని తండ్రి అన్నాడనీ,

అదంతా చూడాలనుకున్నాడు. ఒక ఇల్లు ప్రవేశించాడు. ద్వారంలోనుంచికాదు. ఇంట్లోనుంచే. గోడల్లేవుగామరి! గోడల్లేకపోతే ద్వారంలోంచి ఎలా వెళ్తారు? అందుకని ఇంట్లోనుంచే ఇంట్లోకి వెళ్ళాడు. సరిగా మధ్యకి వెళ్ళాడు.

"ఇల్లుమధ్య అని ఎలా తెలిసింది?" అని అడుగుతారు చాదస్తులు. గోడల్లేనప్పుడంతా మధ్యే, అంతాచివరే, అంతా మొదలే!

కనక గోపీ మధ్యకు వెళ్లాడు. బాగానేవుంది. ఇక వూరుకోకూడదా? ఎలా వూరుకుంటాడు? చెప్పగా—

అటూ ఇటూ చూచాడు. అన్నిపక్కలా గోడలకు బదులు అద్దాలు కనిపించినయ్.

"అరే!"

అన్ని అద్దాల్లో తన బొమ్మలే కనిపించినయ్. వాటి మీద ఏదో రాశారే!

వెనక్కి చూచాడు. వెనక్కుంటేతనవెనక్కీ! మరి ఆ యింటికి గోడల్లేవుగా! గోడల్లే నింటికి వెనకుండదుగా! అందుకని తన వెనక్కే చూచుకున్నాడు.

అద్దంలో కనిపించినయ్. కళ్లు జిగల్ భుగాల్ మన్నప్పుడు అక్షరాలు కనిపించవుగా! మళ్లా చూస్తారుగా! చూచాడు. అవన్నీ అక్షరాలు—వస్తున్నయ్, తళతళ మంటున్నయ్.

చదివాడు—

"ప్రజాసామాన్యం"

"ప్రజాసామాన్యం"

"ప్రజాసామాన్యం"

అన్నద్దాల్లోనూ కనిపించినయ్. చెప్పాఁగా గోపీకి ఆలోచన లెక్కువనీ——

ఆలోచించాడు. అన్నద్దాల్లోనూ తన బొమ్మలే! ఒక్కొక్క బొమ్మమీదా ఈ మాటలు,

"ప్రజాసామాన్యం"

"ప్రజాసామాన్యం"

"ప్రజాసామాన్యం"

వస్తున్నాయ్. పోతున్నయ్ తళతళమంటున్నయ్, పోతున్నయ్.

బలే బాగుందే? అన్నీ ప్రజాసామాన్యాలే! అంతా ప్రజాసామాన్యమే. ఆ సంగతి అసలు వారికి తెలియదు. ఆమాటకొస్తే గోపీకి తెలుసా ఏమిటి? తన్ను విడిచిపెట్టుకొని బైట వెతికాడుగా! లోపలకు చూసుకుంటే తెలిసేది. భగవంతుడూ అంతే! భగవంతుడేనా ఏమిటి ప్రజాసామాన్యం? ఇద్దరూ లోపలే వుంటారే!

"సిగ్గా?"

అటువంటప్పుడు భయం వెయ్యదూ? భయంవేస్తే పరిగెత్తాలని పుస్తకాల్లో చదివాడుగా! పరిగెత్తడూ?

గోపీ పరిగెత్తాడు. బొమ్మలన్నీ పరుగులెత్తాయి. ఎవరి ప్రజాసామాన్యం వారివెంట పోదూ?

భయమనుకున్నాడు; భయపడ్డాడు. పరిగెత్తాలనుకున్నాడు: పరిగెత్తాడు. అతనితో ఏపనయినా అంతే. చెప్పాగా అతననుకుంటాడనీ, చేస్తాడనీ— ఎలాగయితే పరిగెత్తాడు. బైటికి రాగానే బొమ్మలన్నీ అతనిలో లీనమై పోయినయ్.

"అంతే?"

ప్రజాసామాన్యం తన యథాస్థానానికి చేరుకున్న దన్నమాటేగా? ఒక్కొక్కడిలో ఎంత ప్రజాసామాన్య ముంటుంది? వందా? అబ్బో! బలే పెద్దదే! సంతాన నిరోధం చెయ్యవలసిందే! లేకపోతే వుదరాలు పగిలిపోవూ!!!

మర్నాడు వూరుకుంటాడా? అందులో గోపీ. మొహం కడుక్కొని వెళ్ళి స్నేహితుడితో చెప్పాడు.

"ఆ వూళ్ళో మనుషుల్లేరు?"

స్నేహితుడు చెప్పాడు—"అదే ప్రజా సామాన్యం."

"ఇళ్ళు లేవు"

స్నేహితుడు చెప్పాడు—"ప్రజాసామాన్యానికి ఇళ్ళుండవు."

"గోడల్లేవు"

"ప్రజాసామాన్యాని కంతే"

"అన్నీ అద్దాలే!"

"అదే ప్రజాసామాన్యం"

"బొమ్మలన్నీ నాలో లీనమైనాయ్"

"నువ్వే ప్రజాసామాన్యం"

"మరంతా అలా అంటారే?"

"వాళ్ళే ప్రజాసామాన్యం"

ఆలోచించాడు. చెప్పాగా గోపీకి ఆలోచనలు ఎక్కువనీ, చిన్నప్పుడే మలేరియావచ్చిందనీ.

"ఆలోచనలు ఎక్కువై చెడిపోతున్నావ్." అన్నాడు తండ్రి

"అంటే ఏమిటి?" అనిఅడిగాడు గోపీ.

"ఇదే, ఇదే, ఇదే!" అన్నాడు తండ్రి.

.............